# నిద్రమబ్బు మేఘం

-డా.సి.యం.అనూరాధ

జూన్ నెల! ఎండలు కాస్త తగ్గుముఖం పట్టాయి. అయితే ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా నీటి కొరత తీవ్రంగా ఉంది. రామయ్య తాత చీనీ తోటలో గుడిసె వేసుకుని బయట నులక మంచం మీద పడుకుని తదేకంగా ఆకాశం వైపు చూస్తూ ఆలోచిస్తున్నాడు. ఈ ఏడాది నిరుటి పరిస్థితే. చీనీ తోట మంచి కాపులో వుంది. ఇప్పుడు రెండు మంచి వర్షాలు పడితే చాలు మంచి దిగుబడి వస్తుంది. కానీ కాయలు పక్వానికి రానున్న ఈ సమయంలో బావిలో నీరు ఎండిపోయింది. ఎన్ని బోర్లు వేసినా నీరు పడడంలేదు. దేవుడు కరుణించి వర్షమైనా కురిపిస్తాడేమో అనుకుంటే అదీ జరిగేలా లేదు. బోర్లు వేయడానికి లక్ష రూపాయల పైనే ఖర్చయింది. కానీ ఒక చుక్క నీరైనా పడ లేదు. తోట వైపు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. పెద్ద పెద్ద పిందెలతో వున్న పచ్చని చెట్లన్నీ నిలువునా ఎండిపోతున్నాయి. జరుగుతున్న విషాదానికి ప్రత్యక్ష సాక్షిలా చూస్తూ ఉండిపోవడం తప్ప తనేం చేయగలడు? కరువు చేసే కరాళ నృత్యం కళ్లారా తిలకించడం తప్ప మరో దారి లేదు.

నిరుడు బోర్లు వేయడానికి చేసిన అప్పు ఇంకా అలాగే ఉంది. నిరుటి పరిస్థితే ఈ ఏడాది. ఒక్కసారి, ఒకే ఒక్కసారి పంట చేతికి వచ్చినా ఈ అప్పులను తీర్చేయవచ్చు. చీనీ పళ్లకు ఈ సీజన్‌లో బెంగుళూరులో మంచి ధర ఉంది. కానీ ఆ భగవంతుడు దయ చూపించడంలేదు. ఋతు పవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయి. అన్న చోట్లా వర్షాలు పడుతున్నాయి. కానీ రాయలసీమలో అందునా అనంతపురం జిల్లాలో ఒక్క వర్షం కూడా పడలేదు. ఆకాశంవైపు చూస్తే నల్లని మేఘాలు కనిపిస్తాయి. ఏ క్షణాన్నయినా వర్షం పడవచ్చునని అనిపిస్తుంది. కానీ వర్షం మాత్రం రాదు. ఊరించి ఊరించి ఆ నల్లమేఘాలు వెళ్లిపోతున్నాయి.

"నాన్నా! అన్నం తిందువుగానీ రా'' కూతురు గంగ పిలుపుతో ఈ ఆలోచనల్లోంచి తేరుకుని ఈ లోకంలోకి వచ్చాడు రామయ్య తాత.

"వద్దమ్మా! నాకేం తినాలనిపించడంలేదు. ఆకలిగా కూడా లేదు'' నీరసంగా పలికాడు రామయ్య తాత.

"అలా అంటే ఎలా నాన్నా. ఈ వయసులో నీవుఇలా దిగులుపడి అన్నం తినకపోతే నీ ఆరోగ్యం ఏం కావాలి? నీకేమైనా అయితే మాకు దిక్కెవరు? ఒక్కసారి ఆలోచించు'' గంగ గొంతు గాద్గదికమయింది.

రామయ్య తాత గుండె ద్రవించింది.

"పద తల్లీ వస్తున్నా'' అంట భోజనానికి లేచాడు.

★★★

రామయ్య తాతకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. భార్య పిల్లల పసితనంలోనే మరణించినా, మరో పెళ్లి గురించి ఆలోచించకుండా పిల్లల్ని జాగ్రత్తగా పెంచుకొచ్చాడు. తమ ఊళ్లో స్కూల్ లేదని కొడుకులిద్దరినీ పొరుగూరికి పంపించి తన శక్తికిమించి చదివించాడు.

ఎవరు చెప్పినా వినకుండా కొడుకులు తనలా మట్టి పిసుక్కుని బ్రతకకూడదని అప్పులు చేసి మరీ పై చదువులు చదివించాడు. ఆడపిల్లను పొరుగూరికి పంపడం ఇష్టంలేక గంగను చదివించలేకపోయాడు. కొడుకులిద్దరూ మంచి ఉద్యోగాల్లో స్థిరపడి తమకు నచ్చిన పిల్లలని పెళ్లి చేసుకుని హాయిగా ఉన్నారు.

వాళ్లు ఏ రోజు తండ్రి గురించిగానీ, చెల్లెలు గురించిగానీ ఆలోచించలేదు. అదే ఊరికి చెందిన చిన్న రైతు చంద్రంకిచ్చి గంగ పెళ్లి ఉన్నంతలో ఘనంగా జరిపించాడు రామయ్య తాత.

ఒక బిడ్డ పుట్టగానే పాము కాటుతో చంద్రం మరణించాడు. బిడ్డ రవితో సహా గంగ తండ్రి గూటికి చేరుకుంది. ఆ రోజు నుంచీ వాళ్లకూ అమ్మా నాన్నా అన్నీ తానే అయి కుటుంబాన్ని లాక్కొస్తున్నాడు రామయ్య తాత.

"అదేంటి నాన్నా పెరుగు వేసుకోకుండానే చేయి కడుక్కోబోతున్నావు'' చేయి కడుక్కోకుండా తండ్రిని వారించి పెరుగు వడ్డించింది గంగ.

"తాతా! తాతా! వర్షం పడుతోంది. పెద్ద పెద్ద చినుకులు తెలుసా. ఇంతింతేసి చినుకులు బడబడా పడుతున్నాయి. త్వరగా రా'' అంటూ మనవడు రవి గబగబా విషయం చెప్పేసి వర్షంలో తడవడానికి పరుగెత్తి వెళ్లాడు. గబగబా పెరుగన్నం తినేసి బయటకు పరుగెత్తినట్లే నడిచాడు రామయ్య తాత.

రామయ్య తాత బయటకు వచ్చేలోపే వర్షం ఆగిపోయింది. బడబడా నాలుగు చినుకులు రాలి ఆగిపోయినట్లుంది. రామయ్య తాత నీరుగారిపోయాడు. వర్షంలో తడవడానికి వెళ్లిన రవి బిక్క మొహం వేసుకుని వచ్చాడు "తాతా! వర్షం అప్పుడే ఆగిపోయిందే'' అంటూ.

"రవీ! తాతను విసిగించక ఇలారా'' కసిరింది గంగ. ఆమెకు తెలుసు తండ్రి గుండెలోని బాధ. వర్షం వస్తున్నదని రవి చెప్పగానే ఎంత సంతోషించాడో పాపం. ఇప్పుడు వర్షం ఆగిపోవడంతో అంతగా దిగులు పడుతున్నాడు.


"కోప్పడకమ్మా వాడిని. ఇందులో కొత్తగా బాధ పడేదేముంది? ప్రతి ఏడాదీ చూస్తున్నదేగా. ఏదో నిద్రమబ్బు మేఘం వెళ్తూ వెళ్తూ చేసిన నిర్వాకం ఇది'' నిర్లిప్తంగా ఆకాశంవైపు చూస్తూ అన్నాడు రామయ్య తాత. ఆర్తిగా మనవడిని దగ్గరకు తీసుకున్నాడు.

"తాతా! నిద్ర మబ్బు మేఘం అన్నావే అంటే ఏమిటి? ఆ కథ చెప్పవా?'' తాతయ్య గుండె

లోని బాధను గుర్తించలేని పసి మనసుతో అడిగాడు రవి.

“ఇలా పడుకో చెప్తాను” మనవడిని తన ప్రక్కనే మంచంలో పడుకోబెట్టుకుని నిద్ర పుచ్చుతూ కథ చెప్పసాగాడు రామయ్య తాత.

“పైన పెద్ద ఆకాశం ఉందికదా. ఆ ఆకాశంలో ఏమున్నాయి? అలా చూడు పెద్ద పెద్ద మేఘాలు. ఆ మేఘాలన్నింటికీ రాజు ఒకడున్నాడు. అతడే మేఘాలరాజు. మేఘాలు అన్నీ ఇంకో చోటుకి ప్రయాణిస్తూ ఉంటాయికదా. ఆకాశ మార్గంలో ఒక చోట నుంచి అలా వెళ్లి మేఘాలు మార్గ మధ్యంలో ఎక్కడైనా ఊరు కనిపిస్తే అక్కడ ఆగి వర్షం కురిసి వెళ్లాలి. ఇది వాళ్ల రాజు ఆజ్ఞ మరి. కాబట్టి మేఘాలు ఆకాశంలో వెళ్తూ వెళ్తూ ఎక్కడ ఊరు కనిపిస్తే అక్కడ వర్షం కురిసి వెళ్తుంటాయి. అలా ప్రయాణిస్తున్న మేఘాలు మన అనంతపురాన్ని సమీపిస్తాయి. అప్పుడు వాళ్ల రాజు అంటే మేఘాల రాజు అందరినీ ఆగమని చెప్పి సమావేశ పరచి ఇలా చెప్పాడట. ‘చూడండి మేఘాలూ! ఇప్పుడు రాబోతున్న ఊరు అనంతపురం. అలవాటు ప్రకారం ఊరు వచ్చింది కదాని జల జల వర్షం కురవకండేం. అన్ని ఊళ్లల్లో వర్షం కురవవచ్చు కానీ అనంతపురంలో కురవకూడదు సరేనా’ అలా మేఘాల రాజు చెప్పిన విషయం మేఘాలన్నీ విన్నాయి. కానీ వాటిలో ఒక నిద్ర మబ్బు మేఘం ఉంది. అది ఎప్పుడూ నిద్ర మబ్బులో ఉంటుందట. రాజు చెప్పిన విషయం ఈ నిద్ర మబ్బు చెవిన పడలేదుట. అది నిద్ర లేచేసరికి అనంతపురం కనిపించింది. అలవాటుగా ఆ నిద్ర మబ్బు మేఘం ఊరు వచ్చింది కదాని ఆగి జలజలా వర్షాన్ని కురిపించింది. ఇంతలో మిగతా మేఘాలన్నీ ఈ విషయం గమనించి దానిని పట్టుకుని కొట్టాయి. అది బిత్తరపోయి చూస్తుంటే చెప్పాయి “రాజుగారు మనకేం చెప్పారు? ఇప్పుడు వచ్చేది అనంతపురం. అక్కడ వర్షం కురవకూడదని చెప్పారా లేదా? ఎందుకలా కురిశావ్?” అరిచాయి. నిద్ర మబ్బు మేఘం దెబ్బలు దులుపుకుని విషయం గ్రహించి కురవడం మానేసింది. అది గబగబా నాలుగు చినుకులు రాల్చినప్పుడు మనం వర్షం వచ్చిందనుకుంటావు. మిగతా మేఘాలు దానిని కొట్టి అది వర్షం కురవకుండా చేస్తాయన్నమాట. మనకు వచ్చే ఆ నాలుగు వర్షం చినుకులు నిద్ర మబ్బు మేఘం పని అనీ అర్థం. ఇప్పుడు అర్థమయిందా బాబూ” రామయ్య తాత కథ చెప్పడం ముగించి కళ్లనీళ్లు ఒత్తుకున్నాడు.



★